# నేటి ప్రస్థానం

తెలుగు దిన పత్రిక

APTEL/2013/54506




కిషన్‌రెడ్డి, కేటీఆర్‌కు

## పోలీసుల షాక్

04


ఎడిటర్: ఐతగోని రాఘవేంద్ర | మంగళవారం, 8 ఏప్రిల్ 2025 | సంపుటి: 12 | సంచిక: 26 | పేజీలు: 4 | వెల:10/-




- మార్కెట్‌ను ముంచెత్తుతున్న కల్తీ ఆహార పదార్థాలు
- సుగంధ ద్రవ్యాల నుంచి టీ పొడి వరకు అన్నీ కల్తీనే
- ఆహార కల్తీలో దక్షిణాదిలో తెలంగాణకు రెండో స్థానం
- చట్టాలున్నా కొరవడిన అధికారుల నిఘా
- ఇదే అదునుగా చెలరేగిపోతున్న కల్తీ మాఫియా
- అనారోగ్యాలకు కేరాఫ్‌గా మారిపోతున్న వంటిల్లు

# కల్తీ కాలం

## చెల్లించక తప్పదు మూల్యం





ఇది కలం కాలం మాత్రమే కాదు... కల్తీకాలం కూడా. మానవ సంబంధాల నుంచి ప్రతీది కల్తీ అయిపోయాయని పెద్దలు ఆవేదన చెందుతున్న వేళ మరో ఆశ్చర్యకరమైన నివేదిక వెలుగులోకి వచ్చింది. ఆహార కల్తీలో దక్షిణాదిలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉందన్న విషయం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. మనం రోజూ తీసుకునే ఆహారంలో దాదాపు 80 శాతం కల్తీనే. నమ్మశక్యం కాకున్నా ఇదే నిజం. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే వెల్లడించింది. మనం 'నంబర్ వన్' అని కొనుగోలు చేసే సరుకులు కూడా కల్తీనే. ఒక్క మాటలో చెప్పాలంటే మన వంటిల్లు అనారోగ్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి.

- హైదరాబాద్, ఏప్రిల్ 7 (నేటి ప్రస్థానం):

2 లో

## ఆ దొంగే లేకుంటే.. రబ్బరే లేదు!



ప్రపంచంలో నేడు రబ్బర్ ఉందంటే దానికి ప్రధాన కారణం ఒక దొంగ అన్న సంగతి మీకు తెలుసా? 19వ శతాబ్దానికి ముందు కేవలం బ్రెజిల్‌లో మాత్రమే రబ్బరు దొరికేది. అది ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ గుత్తాధిపత్యం వహించేది. ఇలా కాదని, రబ్బరు విత్తనాలు ఇవ్వాలని బ్రిటిష్ వారు బ్రెజిల్‌ను అడిగితే ఇచ్చేందుకు ఆ దేశం నిరాకరించింది. దీంతో ఇలా కాదని భావించిన బ్రిటిష్ వారు ఆ రబ్బరు విత్తనాలను దొంగిలించి తెచ్చే పనిని ఓ బ్రిటిష్ ఏజెంట్‌కు అప్పగించారు. అతడి పేరు హెన్రీ అలెగ్జాండర్ విక్‌హామ్. జోయ్ జాక్సన్ రాసిన 'ది థీఫ్ ఎట్ ది ఎండ్ ఆఫ్ ద వరల్డ్: రబ్బర్ పవర్, అండ్ సీడ్స్ ఆఫ్ ఎంపైర్' బుక్‌లో విక్‌హామ్ విత్తనాల స్మగ్లింగ్ గురించి వివరంగా రాశారు.

బ్రెజిల్ నుంచి రబ్బరు విత్తనాలు ఎగుమతి చేయడం అంత తేలికైన పని కానప్పటికీ 1876లో 70 వేల రబ్బరు చెట్ల విత్తనాలను బ్రెజిల్ నుంచి చాకచక్యంగా దొంగిలించి లండన్‌లోని క్యూ గార్డెన్స్‌కు తీసుకొచ్చాడు. వీటిని బ్రిటిషర్లు మలేషియా, శ్రీలంకతోపాటు బ్రిటిష్ కాలనీలో వేసి మోడ్రన్ రబ్బర్ ప్లాంటేషన్ ఇండస్ట్రీకి నాంది పలికారు. ఆ తర్వాతి కాలంలో సౌత్ అమెరికా లీఫ్ బ్లైట్ ఫంగల్ డిసీజ్ సోకి బ్రెజిల్‌లో ఉన్న రబ్బర్ చెట్లు నాశనం అయిపోయాయి. ఈ దొంగ విజయవంతంగా రబ్బరు విత్తనాలు తీసుకురావడం వల్ల ఆగ్నేయాసియా ప్రధాన రబ్బరు ఉత్పత్తిదారుగా మారి ఆటోమొబైల్ రంగానికి వెన్నెముకగా నిలిచింది.



# హెచ్‌సీయూ వివాదం.. ప్రభుత్వం పిటిషన్!




- కృత్రిమమేధ సాయంతో ఫేక్ వీడియోలు క్రియేట్ చేసిన వారిపై చర్యలు
- 400 ఎకరాల భూ వివాదంలో నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్
- సమాజాన్ని తప్పుదోవ పట్టించే వారిపై చర్యలు తీసుకోండి

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల వ్యవహారంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) సాయంతో నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్‌ను సృష్టించారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపించారు. భూమిని చదును చేసే క్రమంలో బుల్డోజర్లను చూసి జింకలు, నెమళ్లు పారిపోతున్నట్లు నకిలీ వీడియోలను సృష్టించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. నకిలీ వీడియోలు సృష్టించిన వారిపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని ప్రభుత్వం న్యాయస్థానాన్ని కోరింది. ఈ పిటిషన్‌పై ఏప్రిల్ 24న వాదనలు వింటామని హైకోర్టు తెలిపింది.

6 04

# కొలువుల జాతర

## ఆ ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధం.. ఖాళీలు, విద్యార్హతలు ఇవే!

- 12 విశ్వ విద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తూ జీఓ21 జారీ విడుదల
- మార్గదర్శకాలను విడుదల చేసిన విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

4వ పేజీలో..






# ప్రజారోగ్య వ్యవస్థ పటిష్టమవ్వాలి

## నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



ఒక దేశాభివృద్ధికి పటిష్టమైన విద్య, వైద్య రంగాలు మూలస్తంభం లాంటివి. వాటిని విస్మరిస్తే దేశాల పురోగతి శూన్యం. మానవ వనరుల వృద్ధి కూడా జరగదు. నేటి ఆధునిక కాలంలో ఆధునిక వైద్య సేవలు అందుబాటులో వచ్చినప్పటికీ...పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య భద్రత ప్రమాదంగా మారింది. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో ఆరోగ్యం స్పృహ కొరవడడం, ప్రజల ఆర్థిక స్థితి దిగజారిపోవడం. కాబట్టి ఆరోగ్య సమస్యలకు కారణాలను తెలుసుకుంటూ సరైన చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో మానవాళి తీవ్ర ఆరోగ్య ముప్పును ఎదుర్కునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 1948 నుండి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది. ఈ సంవత్సరం 'ఆశాజనక భవిష్యత్తు, ఆరోగ్యంతోనే ప్రారంభం' అనే ఇతివృత్తంతో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తోంది. ఆరోగ్య సమస్యలకు తొలి దశలోనే చర్యలు చేపట్టడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని ఈ నినాదం గుర్తు చేస్తుంది.

పుట్టిన బిడ్డ నుంచి చనిపోయే వృద్ధుని వరకు వయసుతో నిమిత్తం లేకుండా అనేక వ్యాధులు చుట్టూ ముడుతున్నాయి. ముఖ్యంగా జీవనశైలి లేదా అసంక్రమిత వ్యాధులైన క్యాన్సర్, మధుమేహం, గుండెపోటు, రక్తపోటు, కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి. క్షయ, న్యూమోనియా, కలరా, టైఫాయిడ్, హైపటైటిస్, డెంగ్యూ, మలేరియా, అమీబియాసిస్ లాంటి సంక్రమిత వ్యాధుల తీవ్రంగా వ్యాపిస్తున్నాయి. ఈ వ్యాధులు అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మహమ్మారి కాలంలో కాలుష్యంతో క్యాన్సర్, ఆస్తమా, గుండె జబ్బుల తీవ్రత పెరిగిందని పలు అధ్యయనాల్లో తేలింది. జనాభా పెరుగుదల, పరిశ్రమలు, వాహన కాలుష్యం రకరకాల రోగాలకు కారణం అవుతున్నాయి. మరోవైపు పోషకాహార లోపం అనేది నేడు అత్యంత ప్రమాదకరంగా మారింది. స్త్రీలు , చిన్న పిల్లలు వీటి బారినపడి అనేక రోగాలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆహార పదార్థాల కలుషితం సైతం ప్రధాన సమస్యగా మారింది. పారిశుద్ధ్య వ్యవస్థలో భాగమైన స్వచ్ఛమైన తాగునీరు , మురుగునీటి వ్యవస్థ సరిగా లేకపోవడం వలన అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనికితోడు బిజీ జీవితంలో మానవుడు రోజురోజుకు శారీరక శ్రమకు దూరం కావడం వలన అనేక జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.






ఇప్పటికే కరోనా వంటి వ్యాధితో విశ్వ మానవాళి అల్లకల్లోలమైనది. సరైన వైద్యం అందక లక్షలాది ప్రాణాలు గాలిలో కలిశాయి. దీంతో వైద్య రంగంలో, మనుషుల జీవనశైలిలోహొపెను మార్పులు వచ్చాయి. అయినప్పటికీ ప్రతి ఏటా అంతు చిక్కని వ్యాధులతో ప్రజలు అసువులు బాస్తున్నారు. కాబట్టి ప్రతి దేశం ఆరోగ్య సంక్షోభాన్ని నివారించడానికి సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. ముఖ్యంగా అధిక జనాభా గల భారత్ వంటి దేశంలో ఆరోగ్య స్పృహ మరింత పెరగాలి.

దేశంలో ఎక్కడైనా ప్రతి పౌరుడికి నాణ్యతతో కూడిన ఉచిత వైద్య సేవలను పొందే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. గ్రామ ఆరోగ్యం, పారిశుద్ధ కమిటీలు క్రియాశీలకంగా పని చేసే విధంగా చూడాలి. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి. ప్రాథమిక, జిల్లా ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా సిబ్బందిని , వైద్యులను నియమించాలి. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన పల్లె ,బస్తీ దావాఖానాలలో మౌలిక సదుపాయాలు పెంచాలి. దవాఖానల్లో అన్ని రకాల మందులను ఉచితంగా అందించాలి. జనరిక్ మందులను అందుబాటులోకి తేవాలి. కార్పొరేట్ ఆసుపత్రుల నియంత్రణ, రోగుల హక్కుల రక్షణ పై చర్యలు తీసుకోవాలి. చిన్నపిల్లలు, మహిళల్లో ఎదురవుతున్న రక్తహీనత, పౌష్టికాహార సమస్యను పరిష్కరించడానికి పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు పరచాలి. అందరికీ ఉచిత వైద్యాన్ని అందించే ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని లక్ష్యసిద్ధితో ముందుకు తీసుకెళ్లాలి. ఈ కార్యక్రమం కింద తెలంగాణ ప్రభుత్వం రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు వైద్య సహాయ పరిమితి పెంచడం అభినందనీయం. ఆహార పంటల సాగులో సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి. సంప్రదాయేతర ఇంధన వనరులు వాడుతూ కాలుష్యాన్ని తగ్గించాలి. ప్రజారోగ్యానికి బడ్జెట్లో తగినన్ని నిధులు కేటాయించాలి. అప్పుడే ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఆరోగ్య సంరక్షణ, జీవన ప్రమాణాలు పెంపు అనేది సాధ్యమవుతుంది.

సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
79895 79428





- మార్కెట్‌ను ముంచెత్తుతున్న కల్తీ ఆహార పదార్థాలు
- సుగంధ ద్రవ్యాల నుంచి టీ పొడి వరకు అన్నీ కల్తీనే
- ఆహార కల్తీలో దక్షిణాదిలో తెలంగాణకు రెండో స్థానం
- చట్టాలున్నా కొరవడిన అధికారుల నిఘా
- ఇదే అదునుగా చెలరేగిపోతున్న కల్తీ మాఫియా
- అనారోగ్యాలకు కేరాఫ్‌గా మారిపోతున్న వంటిల్లు

# కల్తీ కాలం

## చెల్లించక తప్పదు మూల్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (నేటి ప్రస్థానం):** కల్తీ ఆహార పదార్థాలు మార్కెట్‌లో విచ్చలవిడిగా రాజ్యమేలుతున్నాయి. తయారీదారులు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఆయా ఆహార పదార్థాలపై తయారీ తేదీ, ఎంత కాలంలోగా వినియోగించాలనే వాటిని ముద్రించకుండానే విక్రయిస్తున్నారు. ఫలితంగా వినియోగదారులు డబ్బులిచ్చి మరీ అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. సుగంధ ద్రవ్యాలు మొదలు నెయ్యి, డాల్డా, తేనె, పోపు గింజలు, మసాలా దినుసులు, పొడులు, పసుపు, కారం తదితర వస్తువులతోపాటు పచ్చళ్లు కూడా కల్తీనే. ఇవన్నీ మనం నిత్య జీవితంలో ఉపయోగిస్తున్నవే.

### ఎందులో ఏం కలుపుతారంటే?

పాలల్లో డిటర్జెంట్ పొడి, యూరియా, గంజి కలిపి కల్తీ చేస్తున్నారు. తేనెను బెల్లం పానకంతో కల్తీ చేస్తున్నారు. ఐస్‌క్రీంలో వాషింగ్ పౌడర్‌లు, పండ్లపై మైనంను పూతగా పూస్తున్నారు. ఉప్పులో సుద్దపొడి కలుపుతున్నారు. ఎండబెట్టిన బొప్పాయి గింజలను మిరియాలులో కలిపేస్తున్నారు. ఇందుకోసం వ్యాక్‌ఆక్సైడ్‌ను కలిపి ఎండలో ఆరబెట్టి కల్తీ చేస్తున్నారు. పసుపులో తౌడు, టీపొడిలో రంపపు పొట్టుతోపాటు కారంపొడిలో కాల్చిన ఇటుకల పొడిని కల్తీగా వాడుతున్నారు. గసగసాల్లో గోధుమ రవ్వ, పంచదారలో బియ్యం రవ్వను కలుపుతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాలను పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి తయారీ, ఎక్స్‌పైరీ తేదీ, బ్యాచ్ నంబర్ ముద్రించకుండానే మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రజలు వాటిని కొనుగోలు చేసి వ్యాధుల బారిన పడుతున్నారు. కల్తీ ఆహార పదార్థాల నివారణకు తూనికలు, కొలతలు, పౌర సరఫరాలు, కల్తీ నిరోధక శాఖ, విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు.

### లైసెన్స్ లేకుండానే తయారీ

ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలను పర్యవేక్షించేందుకు ఆహార నాణ్యత, ప్రమాణాల చట్టం 2006ను అనుసరించి ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నియంత్రణ సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎలాంటి ప్యాకేజీ ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయాలన్నా, మార్కెటింగ్ చేయాలన్నా సంస్థ నుంచి లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఆహార తయారీదారులు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు లేకుండానే తయారు చేసి విక్రయిస్తున్నారు. వంట నూనెల నియంత్రణ చట్టం 1947, నిత్యావసర



సరుకుల చట్టం 1955, ఆహార కల్తీ నిరోధక చట్టం 1954 పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం 1992, తదితర చట్టాలు ఉన్నప్పటికీ కల్తీలను ప్రభుత్వం అరికట్టలేకపోతున్నారు.

### ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

ఆహార కల్తీ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇలాంటి ఆహార పదార్థాలు ఎక్కువ కాలం తీసుకోవడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. కల్తీ ఆహార పదార్థాల్లో ఆరోగ్యానికి హాని చేసే రంగులు, రసాయనాలు వాడడం వల్ల అవి క్యాన్సర్‌కు కారణమవుతాయి. మరికొన్ని కల్తీ ఆహార పదార్థాల వల్ల గుండె, మూత్రపిండాలు, కాలేయం దెబ్బతింటాయి. కల్తీ వల్ల విరేచనాలు, కడుపునొప్పి, కీళ్ల నొప్పులు పట్టి పీడిస్తాయి. కొన్ని కల్తీ ఆహార పదార్థాల వల్ల మెదడు కూడా దెబ్బతినే అవకాశం ఉంది. కల్తీ ఆహార పదార్థాలను ఆకర్షణీయంగా, రుచిగా తయారు చేయడానికి ఎన్నో రసాయనాలను కలుపుతారు. కల్తీ ఆహార పదార్థాల్లో అల్యూమినియం, పొటాషియం ఎక్కువ మొత్తంలో ఉండడం వల్ల మెదడు, ఎముకలు దెబ్బతింటాయి. జీర్ణాశయం దెబ్బతిని అల్సర్‌కు కారణమవుతాయి. కల్తీ ఆహారం వల్ల చర్మంపై దద్దుర్లు, మచ్చలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

### రాష్ట్రంలో సిబ్బంది కొరత

ఆహార పదార్థాలను తనిఖీ చేయడానికి, నాణ్యత ప్రమాణాలను పర్యవేక్షించడానికి తెలంగాణలో సరిపడా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు లేరు. రాష్ట్రంలో చాలా జిల్లాల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల ఖాళీలు భర్తీ కావాల్సి ఉంది. వారు లేరన్న ధీమాతో కల్తీ రాయుళ్లు పేట్రేగిపోతున్నారు. స్థానికంగా నెయ్యి, డాల్డా, వంట నూనెలు, మసాలా పొడులు, పోపు గింజలు, అల్లం వెల్లుల్లి, పసుపు, కారం, తదితర ఆహార పదార్థాలను అనుమతి లేకుండా ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి వదులుతున్నారు. చిన్న చిన్న పరిమాణంలో రూ. 5, రూ. 10 ప్యాకెట్లను పట్టణ, గ్రామీణ పేద, మధ్య తరగతి ప్రజలకు విక్రయిస్తున్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు వాటిని కొనుగోలు చేసి ఉపయోగిస్తున్నారు. అనుమతులు లేని ప్యాకేజీ ఆహార పదార్థాలను విక్రయించడం వల్ల రిటైల్ షాపు నిర్వాహకులకు కూడా అధిక శాతం లాభం ఉండడంతో షాపుల నిర్వాహకులు వినియోగదారులకు కల్తీ ఆహార పదార్థాలనే అంటగడుతున్నారు. ప్రభుత్వ సంస్థల అనుమతి పొంది నిర్ణీత ప్రమాణాలు పాటించే బ్రాండెడ్ ఉత్పత్తిదారులు చిన్న సైజు ప్యాకెట్లను తయారు చేయకపోవడంతో కల్తీ వ్యాపారులకు వరంగా మారింది.



ఆహార కల్తీ విషయంలో కేంద్ర ప్రభుత్వం సంచలన నివేదిక విడుదల చేసింది. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉన్నట్టు వెల్లడించింది. ఆహార భద్రత అధికారులు గత నాలుగు సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా సేకరించిన ఆహార నమూనాల్లో సగటున 22 శాతం కల్తీవే ఉన్నట్టు నివేదిక తెలిపింది. 2021-24 మధ్య దేశవ్యాప్తంగా సేకరించిన ఆహార పదార్థాల నమూనాలు, అందులో కల్తీవిగా తేలిన నమూనాల వివరాలను కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్రాల వారీగా ఇటీవల పార్లమెంటుకు నివేదించింది. ఈ లెక్కల ప్రకారం ఆహార కల్తీలో దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రెండోస్థానంలో నిలిచింది. తెలంగాణలో సేకరించి పరీక్షించిన ప్రతి 100 నమూనాల్లో 14 కల్తీ ఆహారంగా తేలుతున్నాయి. తమిళనాడు 20 శాతం సగటుతో దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రస్థానంలో ఉంది. కేరళ 13.11 శాతం, ఆంధ్రప్రదేశ్ 9 శాతం, కర్ణాటక 6.30 శాతంతో వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి.





## ఎండను ధిక్కరించిన మామిళ్ళు!

చెట్టుకున్నంత స్థితప్రజ్ఞత
మనకుంటే బాగుండేది
ఆకులు రాలినా
అది ఏడ్వదు నవ్వదు
పూవ్వు రాలినా కాయా పండురాలినా
ఎన్నడూ దిగులు గీతాలాలపించదు !
మట్టిని నమ్ముకున్న మానది
మళ్లీ మళ్లీ చిగురేస్తుంది
కాయలు కాస్తుంది పండై
కమ్మటి రసాలనందిస్తుంది!
నీడన నిలుచున్నంతసేపు
ఆ మామిడి తోట
నన్నో అతిథిలా చూసింది !
బయట నా నడి నెత్తిన
ఊరేగిన సూర్యుడు

నా విడిది అభయహస్తం చూసి
ఎప్పుడో తోక ముడిచాడు!
ఎండిన ఆకుల మీద తోటలో
అడుగు తీసి అడుగు వేస్తున్నంతసేపు
నాది వన రాజు విహారయాత్రలా శోభాయమానం
గా ధ్వనించింది!
మధ్య మధ్యలో తీపి పులుపు కలిపిన మామిళ్ళ
కొత్త వాసనొకటి పరిచయమైంది
వింత వింత అనుభూతులు
నన్ను ఉక్కిరి బిక్కిరి చేసినవి!
తోట నిండా నానాజాతి ఫలవృక్షాలు ఉన్నా
వాటి మధ్య సామరస్యం తప్ప
సమరం ఏ కోశానా కనపడలేదు!
నిత్య త్యాగశీలతకు
చెట్లన్నీ నిలువుటద్దాలే
ఒక గంట తిరగాడిన నాకే
జీవిత కాలాన్ని ఆశ చూపి
ఉత్సాహంతో ఉరకలెత్తించింది!
తోటలోని ఏ ఫల వృక్షాన్ని చూసినా
చెప్పులు ఆవలకు విసిరేసి
వాటి మధ్యనే జీవితకాలం ఉదయాస్తమయాలం
దు తిరగాడాలనిపించింది
ఊపిరాడని నగర జీవితం నుండి
కాస్తంత విశ్రాంతి దొరికితే
చెట్టునే ఆశ్రయించాలి!!

(ఎస్ఎన్ఆర్ గారికి కృతజ్ఞతలతో..)



- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

## యాంత్రికతలోంచి వలసపోతూ..

బతికినంత కాలమే
జీవితం
యాంత్రికతలోంచి కొట్టుకుపోయామా
క్షణం తీరిక లేని
ప్రయాణం

కొంత ప్రేమ
మరికొంత పని
ఒత్తిడిని తట్టుకునే ప్రయత్నంలో
ఒకదానితో మరొకటి
పరస్పర ఆకర్షణ వికర్షణ

ఇంకేముంది
చిక్కుల్లో పడ్డాం
విసిగి వేసారి
రెంటినీ
అసంపూర్ణంగా వదిలేసాను

నేను కూడా
అసంతృప్తిగా మిగిలిపోయాను



రచన : ఎన్. లహరి
ఊరు: హైదరాబాద్
9885535506

# నానా రసభావ రుచిరార్థకీర్తి ఘని నన్నయ్య



**నన్నయ్య కవితా రీతుల గురించి కనీసం మాట్లాడే సాహసం చేసేంత విజ్ఞత, అర్హత నాకు లేదు. దైవ కృపతో ఆయన కవితారీతిని నా కర్థమైన రీతిలో చెప్పడానికి ప్రయత్నిస్తాను. అయినా నన్నయ్య కవితా రీతుల గురించి పది పేజీల్లో చెప్పడం అంటే కడలిని కడవలోకి ఎత్తే సాహసం చేయడమే! ఒక సాధారణ మనిషి ఉండడం అనేది చాలా సామాన్యం. కానీ ఒక సాధారణ మహిళ అనే పదం మాత్రం మనకు ఎక్కడా కనిపించదు. ఎందుకంటే ప్రతి మహిళా కూడా ఒక అసాధారణ మహిళ మాత్రమే అని దాని అర్థం. అలాగే మనకు నన్నయ కవిత రీతుల్లో కూడా ఎక్కడా సామాన్యమైన కవితా రీతి కనిపించకుండా అంతటా అసామాన్యమైన కవితారీతులే గోచరిస్తాయి. అనంతమైన సాగరంలో ని ముత్యపు చిప్పల్లోని ముత్యాలను వెదకడం ఎంత కష్టమో నన్నయ కవితా రీతుల గురించి కొన్ని పుటల్లోనూ, కొన్ని పదాల్లోనూ, వాక్యాల్లోనూ చెప్పడం కూడా అంతే కష్టం. నన్నయ్య కవిత రీతుల గురించి తెలుసుకునేందుకు ముందుగా నన్నయ్య గురించి సూక్ష్మంగా పరిశీలిస్తే,**

రాజమహేంద్రవరాన్ని పాలిస్తున్న తూర్పు చాళుక్యరాజు రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి నన్నయబట్టు. ఈ రాజ్యానికి వేంగి దేశము రాజధానిగా ఉండేది. నన్నయ్య బట్టు 11వ శతాబ్దికి చెందినవాడు. తల్లిదండ్రుల గురించి ముఖ్యమైన వివరాలు ఏ గ్రంథాల్లోనూ పూర్తిగా లభ్యం కాలేదు. రాజు గారి కోరిక మేరకు ఆయన మహాభారతాన్ని తెలుగులో రచించడానికి పూనుకున్నారు. మహాభారతము అప్పటివరకు సంస్కృతంలో ఉంది. సంస్కృతంలో వ్యాసమహర్షి మహాభారతాన్ని రచించారు. మహాభారతాన్ని ఆంధ్రీకరించిన ముగ్గురిలో నన్నయ్య మొదటివాడు. ఈ ఆంధ్ర మహాభారతంలో నన్నయ్య బట్టు 18 పర్వాలలో ఆది సభా పర్వాలను అరణ్యపర్వం చతుర్ధాశ్వాసంలో 142 వ పద్యం వరకు రచించారు.

**నన్నయ్యకు ఆదికవి, వాగనుశాసనుడు అనే బిరుదులు ఉన్నాయి. ఆంధ్ర శబ్ద చింతామణి అనే సంస్కృత వ్యాకరణ గ్రంథము, ఇంద్ర విజయము, లక్షణ సారము, చాముండికా విలాసము అనే గ్రంథాలు నన్నయ రచించారని చెప్పుకుంటారు. కానీ దీనికి నిర్దిష్టమైన సాక్ష్యాలు లభించలేదు. ఒక కవి యొక్క కావ్య రీతులు అతని కావ్య రచన నేపథ్యాన్ని గాని కావ్య రచనలు గాని చదివితే తెలుస్తుంది ఒక్కోసారి అతని వ్యక్తిత్వం కూడా ఆ రచన సామర్థ్యాన్ని ప్రభావితం చేయవచ్చు.**

మహాభారతం తెలియని వారు లేరు అనడంలో అతిశయోక్తి లేదు. ఇది చాలా మహత్తరమైన ఇతిహాసం. ఇందులో ఎన్నో ఉపాఖ్యానాలు కనబడతాయి. అవన్నీ కూడా ఒకదానితో ఒకటి సంధానం చేయబడి ఉంటాయి.

**నన్నయ శైలి చాలా సులభంగా పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో ఉంటుంది. అంతేకాదు హితేన సహితం సాహిత్యం అన్నట్లుగా సమాజానికి హితం చేకూర్చే విధంగా నీతులు చెబుతూ అన్ని విషయాలు చదువరులకు ఆకర్షణీయంగా, చదివించేలా చెప్పడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. వీటిని కవిత రీతులుగా మనం పేర్కొనవచ్చు.**

ఉదాహరణకు-

అలిగిన నలుగక యెగ్గలు
పలికిన మరి వినని యట్లు ప్రతి వచనంబుల్
పలుకక బన్నము వడిఎడ
దలపక యున్నతడ చూవె ధర్మజ్ఞుడితన్!

ఈ విషయాలను నన్నయ స్వయంగా తను రాసిన ఆది పర్వంలో భారత అవతారికలో తన రచన శైలి గురించి ప్రస్తావిస్తారు. ఆ పద్యం ఏమిటంటే

ఉ.
సారమతిం గవేంద్రులు ప్రసన్న కథా కలితార్థయుక్తిలో
నారసిమేలునా, ని తరు లక్షర రమ్యత నాదరింప నా
నా రుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత్ సంహిత రచన బంధురుడయ్యె జగద్ధితంబు గన్

ఇది ఆది పర్వంలోని 1.26 ఇందులో ఈ పద్యంలో నన్నయ్య స్వయంగా తన కవిత్వంలో ఒకటి ప్రసన్న కథాకలితార్థయుక్తి , రెండు అక్షర రమ్యత , మూడు నానా రుచిరార్థ సూక్తి నిధి అనే గుణాలు ఉన్నట్లుగా చెప్పారు. మహాభారతంలోని సారాన్ని అజ్ఞానులకు సైతం అర్థమయ్యేలా సమాజానికి జనులకు హితంకూర్చేలా చెబుతాను అన్నారు.

### మొదటి అంశం- ప్రసన్న కథాకలితార్థయుక్తి

అంటే ఏమిటంటే చదువరులందరికీ పండితులైన పామరులైన ఎవరికైనా సులువుగా అర్థమయ్యే రీతిలో ప్రసన్నంగా స్పష్టంగా చెప్పడమే ప్రసన్న కథాకలితార్థయుక్తి అన్నారు. ఇది నిజమైనదని విశ్వనాథ సత్యనారాయణ గారు వ్రాసిన నన్నయగారి ప్రసన్న కథాకలితార్థయుక్తి వ్యాసంలో పేర్కొన్నారు. దీని అర్థాన్ని పరిశీలించినట్లయితే ప్రసన్న అం టే ప్రశాంతమైన, తేజోవంతమైన అని, కవిత అంటే కలిసి ఉన్నది, కూడుకున్నది అని అర్థం. అలాగే యుక్తి అంటే అందరికీ తెలిసిందే, నేర్పు అని అర్థం. అంటే కథలో ఉన్న అర్థాలని ప్రకాశవంతంగా ప్రతిఫ లించేలా తేటతెల్లంగా నేర్పుతో చెప్పడమే ప్రసన్న కథాకలితార్థ యుక్తి అని చెప్పవచ్చు. లక్షణం నన్నయ్యకి కరతలా మలకం అని నన్నయ్య రచించిన భారతాన్ని చదివిన వారందరికీ తేటతెల్లమవుతుంది.

కథా ప్రసన్నత, నన్నయ ఉపయోగించిన ఈ 'ప్రసన్న' అనే శబ్దము దేనిని విశదపరుస్తుంది. అంటే ఆయన చెప్పే కథా గమనంలో సూటిగా స్పష్టంగా విషయాన్ని చెప్పడం, ఏ రకంగా చెబితే పాఠకునికి ఎటువంటి మెలికలు లేకుండా, సరళంగా అర్థం అవుతుందో దాన్ని కథా ప్రసన్నత అనవచ్చు. అంటే సందేహాలకు తావిచ్చేటువంటి ఏదైనా అంశము కథలో ఉంటే ఆ అంశాన్ని ఏరకంగా పరిహరించాలో తెలుసుకుని ఆ సందేహాలకు చోటు లేకుండా వాటిని తొలగించి సరళంగా పామరులకు సైతం అర్థమయ్యేలా రచించడమే కథా ప్రసన్నత.

ఉదాహరణగా ఈ కింది పద్యాన్ని చెప్పవచ్చు.

తే. ఆది 4.123
ఊరు మూల మేర్పడగ నయ్యు విధవలువ
తొలగి ననిలంబు చేత విదూతమగుచు
నవరులెల్ల బరాజ్ ముఖ్యులయిరి దాని
సాభిలాషుడై చూచె మహాభిశుండు

ఆదిపర్వం చతుర్ధాస్వాసంలోని గంగా శాంతనుల కథలో గంగ మానవ కాంతగా బ్రహ్మ సభకు వచ్చినప్పుడు ఆమె చీర ఒకింత తొలగి తొడ భాగం కనపడుతుంది. దేవతలందరూ అది చూడకుండా తలలు ప్రక్కకు తిప్పుకోగా, మహాభిశుడు సాభిలాషుడై చూశాడు అంటే నిజానికి అది అనుకోకుండా జరిగిన చర్యకాదు. అనుకోకుండా చూస్తే అందులో తప్పులేదు కానీ మహాభిశుడు కావాలని చూశాడు అని సాభిలాషుడై అనే పదప్రయోగం చేయడం ద్వారా కథకు ప్రసన్నతను కల్పించాడు. అంటే అనుకోకుండా చూడడంలో తప్పులేదు కానీ కావాలని కోరికతో చూడడం మాత్రం తప్పు. అందుకని బ్రహ్మచాపానికి గురయ్యాడు. తన తప్పును కూడా తెలుసుకుంటాడు. భూలోకంలో ప్రతీప మహారాజు కుమారుడిగా జన్మించడానికి బ్రహ్మ వరం ఇవ్వడంతో మొత్తానికి శాపం కూడా వరంలా మారి కథను సుఖవంతం చేశాడు. అంటే ఇందులో ప్రధాన కథలో ఉన్న శాపాన్ని చిన్న కథ అన్వయించడం ద్వారా దానిలోని సంక్లిష్టతను పరిహరించడమే కథా ప్రసన్నత.

### అర్థ యుక్తి

నన్నయ కవిత రీతిలో మనం గమనించే మరొక రమ్యత అర్థ యుక్తి అని చెప్పవచ్చు. అంటే సాదాసీదాగా సరళంగా ఎటువంటి ఆకర్షణ లేకుండా సాగే కథకు కొన్ని చమత్కారాలు, అలంకారాలు లాంటివి జతపరచి దాన్ని విశేషణంగా అందరి దృష్టి ఆకర్షించేలా ప్రత్యేకంగా సొగసుగా తను ఏ రసాన్ని ఆవిష్కరించదలచుకున్నాడో ఆ రకంగా అర్థ యుక్తిగా చెప్పడం అనవచ్చు. ఉదాహరణకి

ఉ.
నిండు మనంబు నవ్య నవనీత సమానము
పలుకు దారుణ కందర శస్త్ర తుల్యము
జగన్ ను యందు నిక్కమీ రెండును
రాజులందు విపరీతము కావున
విపురుడోప విప్రుడోపునో పండతి శాంతుడై
నరపాలుడు శాపము గ్రమ్మరింపగణ్!( ఆది.1.100)

దండ కోపాఖ్యానంలో వృద్దండ కోపాఖ్యానంలో పౌష్యుడు బ్రాహ్మణ క్షత్రియ స్వభావాన్ని గురించి చెప్పే సందర్భంలో బ్రాహ్మణుల మనసు, వెన్నెల మృదువుగా ఉంటుందని, మాట మాత్రం వజ్రాయుధంలా, కఠినంగా ఉంటుందని, అదే రాజులలో ఈ లక్షణాలు పూర్తి వ్యతిరేకంగా ఉంటాయని అంటాడు. హృదయం అనే మాటకి బదులుగా తెలుగులోపల 'నిండు మనంబు' అంటూ 'నిండు' అనే విశేషణాన్ని చేకూర్చడము, అలాగే మూల గ్రంథంలో 'నవనీతం' అని ఉంటే దానిని 'నవ్య నవనీతం' అని విశేషణం 'నవ్య' చేర్చడం ద్వారా చక్కటి అర్థ యుక్తిని పొందుపరిచారు.

### రసపరి పోషణ:

కథ సందర్భంగా నన్నయ, రసాన్ని పండించడం కోసం వర్ణనల ద్వారా రస పోషణ చేశారు. వర్ణనలతో చక్కటి రసాన్ని పోషించారు. శృంగార ఘట్టాలైన ఊర్వశి అర్జునుల మరియు కచదేవయానుల శృంగార ఘట్టాలను, చక్కటి శబ్ద ప్రయోగాలతో రసాలను పోషించారు. మహాభారతంలోని యయాతి దేవయాని వృత్తాంతాన్ని శమంతకోపాఖ్యానాన్ని, గాంధారి వివాహాన్ని, వృద్దండకోపాఖ్యానాన్ని ఇలాంటి వాటిని గమనించిన సందర్భాల్లో నన్నయ్య కవితా రీతిలోని పైన చెప్పిన అన్ని అంశాల యొక్క విశిష్టత మనకు స్పష్టంగా తెలుస్తుంది.

### అక్షర రమ్యత

పైన పేర్కొన్నట్లు ప్రసన్న కథాకలితార్థయుక్తి, ఆయన వ్రాసిన రచనల అర్థానికి లోపలి సౌందర్యానికి సంబంధించినదైతే ఈ అక్షర రమ్యత అనే లక్షణము, రచన యొక్క బాహ్య సౌందర్యానికి సంబంధించినది. చెప్పాల్సిన విషయాలను చాలా అందంగా, రమ్యంగా, రమణీయంగా, మనోహరంగా వింటూంటే వినబుద్ధి అయ్యేలా చెవికి ఇంపుగా, అలంకారాలతో, ప్రాసలతో వివిధ సమాసాలతో శబ్ద సౌందర్యం ప్రతిఫలించే అర్థాలతో ఉండడమే అక్షర రమ్యత.

రాజకులేక భూషణుడు రాజ మనోహరు దనరాజయతే
జో జయశాలి శౌర్యుడు విశుద్ధయ
శశ్శరదిందు చంద్రికా
రాజిత సర్వ లోకు డపరాజుత బూరి భుజా కృపాణధా
రాజల శాంత శాస్త్రవ పరాగుడు రాజమహేంద్రుడు దున్నతిన్ ! ఆది 1.3

ఇంకా ఎంతో చెప్పాల్సింది ఉన్నా, ఎంత చెప్పినా నన్నయ్య గూర్చి చెప్పినది, సూర్యుడి ముందు దివిటీలానే తేలిపోతుంది. అందుకే ఇంతటితో స్వస్తి పలుకుతున్నాను. ఇంతటి మహత్తర అవకాశం ఇచ్చిన మీకు వేన వేల వందనాలతో..

నామని సుజనాదేవి
చరవాని 7799305575



## జాతీయ స్థాయి కవితల పోటీలు

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కర్కముత్తారెడ్డి స్మారక కవితల పోటీని నిర్వహిస్తున్నాము. ఈ పోటీ రెండు విభాగాలుగా ఉంటుంది. మొదటివిభాగం- : పదవతరగతి లోపు విద్యార్థిని విద్యార్థులు మాత్రమే అర్హులు..అంశం : ఆదివారం అమ్మకు సెలవు25 లైన్లకు మించని కవితను మాత్రమే పంపాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ధృవీకరణ తప్పనిసరి. రెండవ విభాగం : అన్ని వయసుల వారికి అంశం: అలుపెరుగని అన్నదాత. 25 లైన్లకు మించని కవితను మాత్రమే పంపాలి. కవిత సొంతమనే హామీ పత్రం తప్పనిసరిఒక్కోవిభాగం నుండి ఐదు ఉత్తమ కవితలకు నగదు బహుమతులతో పాటు సన్మానం చేస్తాము.

కవితలు మాకు చేరాల్సిన చివరి తేది:
10 ఏప్రిల్ 2025
వివరాలకు : 8096677409

**దరఖాస్తుల చిరునామా**
కన్వీనర్,
వసుంధర విజ్ఞాన వికాస మండలి(ర)
ఇ.నెం- : 13-1-3/3/6/2E
అవంతినగర్ తోట. మోతినగర్
హైదరాబాద్-500018

**కవితలకు ఆహ్వానం**

## పుడమిపుత్ర అవార్డ్సుకు దరఖాస్తుల ఆహ్వానం

చదువు మల్లారెడ్డి జ్ఞాపకార్థం చదువుమల్లారెడ్డి స్మారక పుడమిపుత్ర పురస్కారాలను అందించనున్నాము. దీనికోసం రైతుల నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము. వ్యవసాయ రంగంలో నూతన ఒరవడి, కొత్త వంగడాల తయారీ, విత్తనాల తయారీ, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, వ్యవసాయోత్పుత్తుల పెంపు వంటి వాటిలో కృషి చేసిన రైతుల నుంచి ధరఖాస్తులు కోరుతున్నాము. వ్యవసాయంలో ఉండి రైతులుగా పనిచేస్తున్నవారికి మాత్రమే ఈ అవార్డ్స అందజేస్తాము. పూర్తివివరాలకు 8096677409 లో సంప్రదించగలరు. ధరఖాస్తులు మాకు చేరాల్సిన చివరితేది ఏప్రిల్ 15.

**దరఖాస్తులు పంపాల్సిన చిరునామా**
చదువు వెంకటరెడ్డి, అధ్యక్షులు
వసుంధర విజ్ఞాన వికాసమండలి
ఆపిల్‌కిడ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
గ్రా.మం-. కమాన్‌పూర్
జిల్లా-: పెద్దపల్లి
ఫోన్- : 94924 63462



# కిషన్‌రెడ్డి, కేటీఆర్‌కు పోలీసుల షాక్

- మార్ఫింగ్ వీడియోలు సోషల్ మీడియాలో పెట్టారని ఆరోపణ
- పలువురు నేతలకు గచ్చిబౌలి పోలీసుల నోటీసులు
- కిషన్‌రెడ్డి, కేటీఆర్‌తో పాటు పలువురిని విచారించే అవకాశం

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై తప్పుడు, మార్ఫింగ్ చేసిన వీడియోలు క్రియేట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారంటూ బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌కు గచ్చిబౌలి పోలీసులు నోటీసులు అందించారు. ఏఐ ఉపయోగించి తప్పుడు పోస్టులు పెట్టారని నోటీసుల్లో పేర్కొన్నారు. 2025 ఏప్రిల్ 9, 10, 11న గచ్చిబౌలి పీఎస్‌కు విచారణకు రావాలని నోటీసుల్లో వెల్లడించారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై తప్పుడు ప్రచారం చేసిన ప్రముఖులను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం హైకోర్టును కోరింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్, కొణతం దిలీప్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ధ్రువ్ రాఠీ, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, రవీనా టాండన్, జాన్ అబ్రహాం, దియా మీర్జా మరికొందరు ప్రముఖులను విచారించనున్నట్లు సమాచారం. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై 2025 ఏప్రిల్ 07వ తేదీన తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. స్వచ్ఛంద సంస్థలు వేసిన పిటిషన్ పై విచారణ చేపట్టిన హైకోర్టు ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందన్న డివిజన్ బెంచ్.. కౌంటర్, రిపోర్ట్ ఈనెల 24లోగా సమర్పించాలని ప్రతివాదులను ఆదేశించింది. ప్రభుత్వం నుంచి సీనియర్ అడ్వకేట్‌గా మేనకా గురుస్వామి తన వాదనలు వినిపించారు. కాగా కంచ గచ్చిబౌలి భూములలో పనులు ఆపేయలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అక్కడ ఎలాంటి కార్యకలాపాలు చేపట్టొద్దని స్పష్టం చేసింది.

# హెచ్‌సీయూ వివాదం.. ప్రభుత్వం పిటిషన్!

- కృత్రిమమేధ సాయంతో ఫేక్ వీడియోలు క్రియేట్ చేసిన వారిపై చర్యలు
- 400 ఎకరాల భూ వివాదంలో నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్
- సమాజాన్ని తప్పుదోవ పట్టించే వారిపై చర్యలు తీసుకోండి




**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** హెచ్‌సీయూ భూ వివాదంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. కృత్రిమమేధ సాయంతో ఫేక్ వీడియోలు క్రియేట్ చేసి ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఏప్రిల్ 24న వాదనలు వింటామని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపించారు. 400 ఎకరాల భూవివాదంలో నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్ తయారు చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బుల్డోజర్లను చూసి నెమళ్లు, జింకలు పారిపోతున్నట్లు ఫేక్ ఫొటో, వీడియోలు క్రియేట్ చేశారని పిటిషన్ లో వివరించారు. ఇటీవలే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కున్నట్లుగా సోషల్ మీడియా నెట్‌వర్క్ ద్వారా కృత్రిమంగా వివాదం సృష్టించటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. కంచె గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తయారు చేసే ఫేక్ వీడియోలు , ఫొటోలు కరోనా వైరస్‌ను మించిన మహమ్మారిలాంటివని ఈ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సర్వే నెంబర్ 25లో ఉన్న భూముల్లో 25 ఏండ్లుగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్‌బీతో పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రైవేటు బిల్డింగ్‌లు, రెసిడెన్షియల్ అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ భవనాలను నిర్మించారు. వాటిని నిర్మించే సందర్భాల్లో ఎలాంటి వివాదాలు, ఆందోళనలు జరగలేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. అప్పుడు వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు కూడా లేవన్నారు. అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందని అంశంపై సమావేశంలో చర్చ జరిగింది. అర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని అధికారులు వివరించారు. వాస్తవాలు వెల్లడించే లోగా అబద్ధాలు సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో వైరల్ కావటం ప్రభుత్వానికి సవాలుగా మారిందని అధికారులు ముఖ్యమంత్రి గారికి వివరించారు. ఏకంగా నెమళ్లు ఏడ్చినట్లుగా ఆడియోలు, బుల్డోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్లుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారు చేశారని పోలీసు అధికారులు సమావేశంలో వివరించారు.



# కొలువుల జాతర

**ఆ ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధం.. ఖాళీలు, విద్యార్హతలు ఇవే!**

- 12 విశ్వ విద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తూ జీఓ21 జారీ విడుదల
- మార్గదర్శకాలను విడుదల చేసిన విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

**నేటి ప్రస్థానం, హైదరాబాద్:** రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 12 విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తూ జీఓ21 జారీ విడుదల చేసింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నియమించిన ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సులను ఆమోదిస్తూ మార్గదర్శకాలను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదివారం రిలీజ్ చేశారు.

## కొత్త మార్గదర్శకాలకు ఆమోదం

అయితే గతంలో తీసుకువచ్చిన గైడ్‌లైన్స్‌ను ప్రభుత్వం రద్దు చేస్తూ కొత్త మార్గదర్శకాలకు ఆమోదం తెలిపింది. మొత్తం మూడు దశల్లో రిక్రూట్ మెంట్ పూర్తిచేస్తారు. ప్రతీ యూనివర్సిటీలోనూ కమిటీ ఏర్పాటు చేసి, రోస్టర్ విధానం, రిజర్వేషన్ విధానానికి సంబంధించిన ప్రక్రియలను పూర్తి చేస్తారు. దీనికి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ నాయకత్వం వహించాల్సి ఉంటుంది. మొదటి దశలో అకడమిక్ రికార్డ్, పరిశోధన ప్రదర్శనలకు సంబంధించి మొత్తం 50 మార్కులను కేటాయిస్తారు. యూనివర్సిటీ వీసీ, ఉన్నత విద్యా మండలి సబ్జెక్ట్ నిపుణుడు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, డిపార్ట్‌మెంట్ ముఖ్యుడు మార్కుల స్క్రూటినీ చేస్తారు. అభ్యర్థికి సంబంధించి యూజీ నుంచి రీసెర్చ్ వరకూ వివిధ విద్యాస్థాయిల్లో మార్కులను ఖరారు చేస్తారు. మొత్తం వంద మార్కుల్లో ఇంటర్వ్యూకు 20 మార్కులు ఉంటాయి. ఇక టీచింగ్ నైపుణ్యానికి 30 మార్కులు, మిగతా 50 మార్కులను యూజీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ విభాగాల నుంచి అభ్యర్థి సాధించిన మార్కుల శాతం ఆధారంగా తీసుకుంటారు. నాలెడ్జ్ అండ్ స్కిల్స్‌కు 30 మార్కులు ఇస్తారు. ఈ మార్కులను టీచింగ్, బుక్ ఆథర్‌షిప్, జాయింట్ ఆథర్ షిప్, ఎడిట్ ఆథర్‌షిప్, కో%-%ఎడిటర్ ఆథర్‌షిప్, పోస్టు%-%డాక్టోరల్ షిప్‌గా విడగొడతారు. ఈ మార్కులను ఆయా సబ్జెక్టు లెక్చరర్లు పరిశీలించి, నిర్ణయిస్తారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు ఇస్తారు. ఇందులో సబ్జెక్టు ప్రజెంటేషన్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, ఓవరాల్ పర్సనాలిటీ, నైపుణ్యాన్ని బట్టి మార్కులు వేయడం జరుగుతోంది. రిక్రూట్ మెంట్ ప్రక్రియకు రేవంత్ ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలపడంతో వర్సిటీలకు 12 సంవత్సరాలుగా ఉన్న సమస్య త్వరలో తీరనుంది.



# అవును, నేను కుక్కనే..
## కానీ నువ్వు గుంట నక్కవు..

- నేను కేసీఆర్‌కు విశ్వాసం గల కుక్కలా ఉంటా
- ప్రజల కోసం కాపలా కుక్కలా పనిచేస్తా
- కడియం శ్రీహరి లాంటి గుంట నక్కను మాత్రం కాదు
- .పల్లా రాజేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**నేటి ప్రస్థానం, హైదరాబాద్** “అవును, నేను కుక్కనే. నన్ను నమ్మిన కేసీఆర్ కు విశ్వాసమైన కుక్కలా ఉంటాను. కానీ ఒక పార్టీలో గెలిచి అధికారం కోసం మరో పార్టీలోకి దూకే కడియం శ్రీహరి లాంటి గుంట నక్కను మాత్రం కాదు” అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యలపై జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కౌంటరిచ్చారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీ దయతో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన గుంట నక్క అని ఆయన మండిపడ్డారు.తన మీద నమ్మకం ఉంచి తనను గెలిపించిన ప్రజలు, నాయకులను కాపాడుకోవడానికి కాపలా కుక్కలా పనిచేస్తానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తాను ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ఈ విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. ప్రజల భూములను కాపాడటంలో రేచు కుక్కలా ఉండి పోరాడతానని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవాల్లో భాగంగా ఈ నెల 27వ తేదీన ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి.. మండల పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన మీద నమ్మకం ఉంచి తనను గెలిపించిన ప్రజలు, నాయకులను కాపాడుకునేందుకు కాపలా కుక్కలా పనిచేస్తానని తెలిపారు. అలవిగాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించడంలో, ప్రజల భూములను కాపాడటంలో రేసు కుక్కలా ఉండి పోరాడతానని పేర్కొన్నారు.



# డాక్టర్ నోముల సిద్ధూ గౌడ్‌కి జీవిత సాఫల్య పురస్కారం

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (నేటి ప్రస్థానం) :** తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి, గౌడ హాస్టల్ డైరెక్టర్, సామాజికవేత్త డాక్టర్ నోముల సిద్ధూగౌడ్‌ని కెనడాకు చెందిన రాయల్ అకాడమీ జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించింది. సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా రాయల్ అకాడమీ ప్రతినిధులు డాక్టర్ జాన్సన్, డాక్టర్ సునీత చేతుల మీదుగా బెంగళూర్‌లో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు సిద్ధూగౌడ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవలను గుర్తించి కెనడాలోని రాయల్ అకాడమీ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుని అందజేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన సేవలను మరింత బాధ్యతగా విస్తరిస్తానని చెప్పారు. సామాజిక సేవలోనే తనకు సంతృప్తి ఉందన్నారు.

# వంట గ్యాస్‌పై రూ. 50 పెంపు

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (నేటి ప్రస్థానం):** వంట గ్యాస్ ధర భారీగా పెరిగింది. గృహావసరాలకు వినియోగించే 14.2 కేజీల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెంచుతున్నట్టు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖమంత్రి హర్దీప్‌సింగ్ పూరీ వెల్లడించారు. ఈ పెంపు భారం ఉజ్వల పథకం లబ్ధిదారులపైనా ఉంటుంది. తాజా పెంపుతో సాధారణ వినియోగదారులు, ఉజ్వల పథకం లబ్ధిదారులు ఇప్పుడు ఒక్కో సిలిండర్‌పై చెల్లిస్తున్న దానిపై అదనంగా రూ. .50 చెల్లించాల్సి ఉంటుంది. వాణిజ్య అవసరాల కోసం వినియోగించే వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను గతవారం 41 రూపాయలు తగ్గించిన కేంద్రం.. ఇప్పుడు గృహ వినియోగదారులపై భారం మోపింది. అలాగే, పెట్రోల్, డీజిల్‌పైనా రూ. 2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని పెంచింది. అయితే, ఈ పెంపు భారాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలే భరిస్తాయి కాబట్టి వినియోగదారులపై ప్రభావం ఉండదని కేంద్రం పేర్కొంది. పెరిగిన ధరలు నేటి నుంచి (8వ తేదీ) నుంచి అమల్లోకి వస్తాయి.



# త్వరలోనే అఖిల్ పెళ్లి డేట్ అనౌన్స్‌మెంట్..?



అక్కినేని మూడో తరం వారసుడు అఖిల్ సినిమాల సంగతేమో కాని పెళ్లి వార్తలతో వార్తలలో వస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం జైనబ్ రవ్జీతో నిశ్చితార్థం జరుపుకున్నారు. అయితే పెళ్లి ఎప్పుడు జరుగుతుందా అని అందరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుండగా, దానిపై మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు. వీలైనంత తొందరలనే ఈ జంట పెళ్లి పీటలు ఎక్కనున్నట్టు తెలుస్తుంది. అయితే రీసెంట్‌గా అఖిల్, జైనాబ్ ఇద్దరూ జంటగా హైదరాబాద్ విమానాశ్రయంలో కనిపించారు. ఎయిర్ పోర్టులో ఒకరి చేయి ఒకరు పట్టుకుని నడుచుకుంటూ వెళుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. వీరిని ఇలా చూసిన నెటిజన్స్ పెళ్లి కళ వచ్చేసింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఈ జంట చాలా చూడముచ్చటగా ఉందని, పెళ్లి పనులలో వారు బిజీగా ఉన్నారేమో అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మరికొందరు కాబోయే భార్యతో కలిసి బర్త్ డే సెలబ్రేషన్స్ కోసం టూర్ వేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నెల 8న అఖిల్ పుట్టినరోజు కావడంతో స్పెషల్‌గా పుట్టినరోజు వేడుకలు జరుపుకొనేందుకే ఇద్దరు మంచి ప్లేస్‌కి వెళుతున్నారేమో అని, ఇదే అఖిల్ లాస్ట్ బ్యాచిలర్ బర్త్ డే పార్టీ అవుతుందేమో అని క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. గతంలో అఖిల్ ఓ అమ్మాయితో నిశ్చితార్థం జరుపుకున్న విషయం తెలిసిందే. తనని పెళ్లి చేసుకుంటాడు అనుకునే లోపు వారిద్దరు బ్రేకప్ చెప్పుకున్నారు. ఇక అఖిల్ చివరిసారిగా ఏజెంట్ చిత్రంతో ఆడియన్స్‌ని అలరించాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇక అఖిల్ కొత్త ప్రాజెక్ట్ ఏంటనేది ఇప్పటి వరకు తెలియజేయలేదు. అయితే అఖిల్ బర్త్ డే సందర్భంగా అప్ డేట్ రానుందని పోస్ట్ పెట్టారు నిర్మాత నాగవంశీ. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. అఖిల్ బర్త్ డే సందర్భంగా ఈ నెల 8న అధికారిక ప్రకటన రాబోతోంది. అదే రోజున ఫస్ట్ లుక్ కూడా రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి 'లెనిన్' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. గ్రామీణ బ్యాక్ డ్రాప్‌లో యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుందని సమాచారం. ఇందులో శ్రీలీల కథానాయిక అని అంటున్నారు.



# బేబీ హీరోయిన్‌కు ఆఫర్లు

బేబీ సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమలో స్టార్ డమ్ సంపాదించుకుంది హీరోయిన్ వైష్ణవి చైతన్య. దీంతో ఈ బ్యూటీకి తెలుగులో వరుస ఆఫర్స్ వచ్చాయి. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ సరసన జాక్ చిత్రంలో నటిస్తుంది ఈ వయ్యారి. ఈ మూవీ ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలకానుంది. ఈ క్రమంలోనే జాక్ మూవీ ప్రమోషన్లలో భాగంగా సిద్ధు, వైష్ణవి ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల భీమవరంలోని విష్ణు కాలేజీలో నిర్వహించిన ఈవెంట్లో జాక్ చిత్రయూనిట్ సందడి చేసింది. ఈ కార్యక్రమంలో అక్కడి విద్యార్థులతో సిద్దు, వైష్ణవి ఇంట్రాక్ట్ అయ్యారు. అక్కడి స్టూడెంట్స్ చేసిన అల్లరి, డ్యాన్సులు చూసి మురిసిపోయారు. ఈ క్రమంలోనే స్టేజ్ మీద వైష్ణవి మాట్లాడుతూ స్టూడెంట్ లైఫ్, కాలేజీ జీవితం గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. అదే సమయంలో భీమవరంలో అని మర్చిపోయి రాజమండ్రి అనేసింది. ప్రస్తుతం జాక్ సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉంది హీరోయిన్ వైష్ణవి చైతన్య. కొన్ని రోజులుగా హీరో సిద్ధు జొన్నలగడ్డతో కలిసి పలు ఇంటర్వ్యూలు, ఈవెంట్లలో పాల్గొంటుంది. తాజాగా భీమవరంలో జరిగన ఈవెంట్లో పాల్గొన్న ఈ బ్యూటీ ఆ ఊరు పేరునే మర్చిపోయింది. దీంతో ఆమెకు హీరో సిద్ధు జొన్నలగడ్డ సాయం చేశారు.







# ఏజ్‌గ్యాప్‌పై కౌంటరిచ్చిన మాళవిక

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ ప్రస్తుతం హృదయపూర్వం చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మాళవిక మోహనన్ కథానాయికగా నటిస్తుంది. సత్యన్ అంతికాడ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం షూటింగ్ మొదటి షెడ్యూల్ పూర్తయినట్లు ప్రకటిస్తూ మాళవిక మోహనన్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. దీంత ఆమె పోస్ట్ పై నెటిజన్స్ ట్రోల్స్ చేశారు. మోహన్‌లాల్, మాళవిక మధ్య వయస్సు వ్యత్యాసం గురించి కామెంట్స్ చేశారు. దీంతో తన గురించి వచ్చిన నెగిటివ్ కామెంట్స్ పై మాళవిక తీవ్రంగా స్పందించింది. "నువ్వు ఇలా మనుషులను ఎలా తూకం వేస్తావో తెలుసా?" అంటూ కౌంటరిచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరలవుతుంది. మాళవిక మోహనన్, నటుడు మోహన్ లాల్ తో కలిసి సినిమా సెట్స్ పై ఫోటోస్ పంచుకుంది. మోహన్‌లాల్ సర్ సత్యన్ సర్ వంటి ప్రముఖుల నుండి నేను చాలా నేర్చుకున్నాను. సినిమాలో వాళ్ళు మ్యాజిక్ చేసే విధానం నన్ను ఆకట్టుకుంది అంటూ రాసుకొచ్చింది. చాలా ప్రతిభావంతులైన వ్యక్తులతో కలిసి పనిచేశానని, తెక్కడిలోని అందమైన కొండలు, తేయాకు తోటలలో సంతోషంగా ఒక నెల గడిపానని తెలిపింది. ప్రస్తుతం మాళవిక మోహనన్ ప్రభాస్ సరసన రాజాసాబ్ చిత్రంలో నటిస్తుంది.

# ఒమన్‌లో విజయ్, రష్మిక ఎంజాయ్

గత కొద్ది రోజులుగా విజయ్ దేవరకొండ-రష్మికల రిలేషన్ షిప్ గురించి ఎన్నో వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. కాని దానికి వారు సరైన క్లారిటీ ఇవ్వడం లేదు. ఓ రకంగా దోబూచులాడుతున్నారు. ఫెస్టివల్స్ ని కలిసే సెలబ్రేట్ చేసుకుంటున్నారు. వెకేషన్స్‌కి కలిసే వెళుతున్నారు. ఇద్దరిలో ఎవరి బర్త్ డే అయిన కూడా ఏదో వెకేషన్‌కి వెళ్లి అక్కడే కలిసి చేసుకుంటున్నారు. అయితే ఏప్రిల్ 5న రష్మిక బర్త్ డే కాగా, ఆమె తన బర్త్ డే సెలబ్రేషన్స్ కోసం ఒమన్ వెళ్లారు. అక్కడ దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేయగానే చాలా మంది 'విజయ్ దేవరకొండ ఎక్కడ?' అంటూ కామెంట్ చేశారు.అయితే విజయ్ దేవరకొండ తన సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలు షేర్ చేయడంతో ఇద్దరు కలిసే ఉన్నారనే చర్చ మొదలైంది. విజయ్ దేవరకొండ అండ్ రష్మిక ఇద్దరు విడివిడిగా ఒమన్ వెళ్లినట్టు తెలుస్తుంది. రష్మిక కంటే ఒక్క రోజు ముందు ముంబై నుంచి విజయ్ దేవరకొండ ఒమన్‌కి బయలుదేరాడు. ఆ తర్వాత రోజు నేషనల్ క్రష్ రష్మిక వెళ్ళింది. ఇద్దరు ఒకే చోటకు వెళ్లారనే సంగతి ఆడియన్స్ అందరికీ అర్థమవుతుంది. మొదట రష్మిక మందన్నా పంచుకున్న ఫోటోలలో ఆమె సముద్రపు ఒడ్డున బోట్‌లో విందు ఆరగిస్తుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ సముద్ర తీరంలో గుర్రపు స్వారీ చేస్తున్న ఫోటోలను, నడుస్తున్న ఫోటోలను విడుదల చేశారు. అవి చూసాక ఇద్దరు ఒకే చోట ఉన్నారని నెటిజన్స్ భావిస్తున్నారు. తమ ప్రేమ గురించి విజయ్ దేవరకొండ ఇలా క్లూ ఇచ్చాడని, వీలైనంత తొందరలోనే వారి రిలేషన్ షిప్‌కి సంబంధించి పూర్తి క్లారిటీ అయితే వస్తుందని నెటిజన్స్ అంటున్నారు. సినిమాల విషయానికి వస్తే విజయ్ దేవరకొండ హీరోగా జెర్సీ మళ్ళీరావా సినిమాల ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబోలో 'కింగ్‌డమ్ చిత్రం రూపొందుతుంది. కొద్ది రోజుల క్రితం సినిమాకి సంబంధించిన టీజర్ విడుదల కాగా, ఇది సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఈ సారి విజయ్ దేవరకొండ ఎలాగైన పాన్ ఇండియా హిట్ కొట్టడం కన్ఫర్మ్ అని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇక చివరిగా సికందర్ చిత్రంతో పలకరించిన రష్మిక ఇప్పుడు నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో 'ది గర్ల్ ఫ్రెండ్' చేస్తున్నారు.

